సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం : 10 : ఏప్రిల్ : 2024



వేసవి దుక్కులు.. ఎంతో మేలు

వేసవిలో లోతు దుక్కులతో బోలెడు లాభాలు ఉన్నాయి. లోతు దక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)
రాయచోటి	6.31
రాజంపేట	6.33
పీలేరు	6.36
మదనపల్లె	6.34

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.280
రెండోరకం	రూ.110	రూ.200

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 102 మెట్రిక్ టన్నులు



ఉత్సాహం.. ఉరకలు

- వైఎస్సార్ సీపీలో ఉగాది జోష్
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపిన మేమంతా సిద్ధం సభ
- అన్ని నియోజకవర్గాల్లో ప్రచార పర్వంలో అభ్యర్థులు
- ఇప్పటికీ కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ క్యాడర్‌లో తప్పని అయోమయం



సాక్షి రాయచోటి : ఉగాది ఉషస్సు కనిపిస్తోంది. ఒక వైపు ప్రజలు పండుగ చేసుకుంటుంటే...మరోవైపు వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉగాది జోష్ కనిపిస్తోంది. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార పర్వం కూడా మొదలు కావడంతో కార్యకర్తలతోపాటు శ్రేణులు, నాయకుల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సంక్షేమం అందించిన ధీమాతోపాటు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జోరుగా చేస్తున్న సిద్ధం, మేమంతా సిద్ధం బస్సు యాత్రలతో యువరక్తం కొత్త పుంతలు తొక్కుతోంది. ఎన్నికలు ఎప్పుడెప్పుడా అంటూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ముందుకు అడుగులు వేస్తోంది. మరోవైపు కూటమిలో ఇప్పటికీ టికెట్ల వ్యవహారం, అసమ్మతి, వర్గ పోరుతో కుదేలవుతోంది.

పదేళ్ల తర్వాత ప్రజల్లోకి...

2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా పనిచేసిన కిరణ్‌కుమార్ సొంత నియోజకవర్గం పీలేరు. రాష్ట్ర విభజన సమయంలో లాస్ట్‌బాల్ ఉందంటూ డాంబికాలు పలుకుతూ వచ్చిన ఆయన చివరికి ఆ బాల్‌కు సిక్సర్ కొట్టకుండానే చేతులెత్తేసి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. అప్పటినుంచి ఇప్పటివరకు నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని ఆయన మళ్లీ ఎన్నికల పుణ్యమా అని అటువైపు మళ్లారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ అంతగా నియోజకవర్గాన్ని పట్టించుకోని ఆయన కూటమి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో మళ్లీ ఇప్పుడు కనిపిస్తున్నారు. 2014 నుంచి 2024 వరకు మధ్యలో ఎక్కడా ప్రజల్లో కనిపించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ఎన్నికల స్టంట్ నేపథ్యంలో ఇక్కడికి వచ్చారని, తర్వాత యదారాజా....తథాప్రజా తప్పదని ఆయా వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కూటమిలో ఆందోళన

అన్నమయ్య జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి సంబంధించి ఇప్పటికీ ఆందోళన వెంటాడుతోంది. ఆయా నియోజకవర్గాల్లో చాలాచోట్ల ఒకరునొకరు కలిసి పనిచేసే పరిస్థితి లేకపోగా, మరికొన్నిచోట్ల ఎమ్మెల్యే అభ్యర్థుల మార్పు భయం వెంటాడుతోంది. నిన్న, మొన్నటివరకు రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిని ఖరారు చేయలేని పరిస్థితి. అక్కడ కూడా మొదటి నుంచి పార్టీని నమ్ముకుని పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులుకు మొండిచేయి చూపి స్థానికేతరుడైన రాయచోటికి చెందిన సుగవాసి బాలసుబ్రమణ్యంను నిలబెట్టారు. ఈ కోణంతో రాజంపేట రెండు వర్గాల మధ్యపచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం తంబళ్లపల్లెకు సంబంధించి టీడీపీ అభ్యర్థిగా జయచంద్రారెడ్డిని ప్రకటించినా పార్టీ ఇన్‌చార్జి శంకర్ యాదవ్ వర్గీయులు ఆందోళన కొనసాగిస్తున్నారు. అక్కడ అభ్యర్థి మార్పు తథ్యమని, కూటమికి సంబంధించి ఇతర అభ్యర్థిని ప్రకటిస్తారని ప్రచారం జోరుగా సాగుతుండడంతో ప్రస్తుత అభ్యర్థి జయచంద్రారెడ్డి వర్గం కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అలాగే రైల్వేకోడూరుకు సంబంధించి జనసేన అభ్యర్థిగా భాస్కర్‌రావును ప్రకటించి తర్వాత 10–15 రోజుల్లోనే మార్పు చేయడంపై కూడా విస్మయం వ్యక్తమవుతోంది. కొత్తగా పార్టీ ఇన్‌ఛార్జి రూపానందరెడ్డి తన అనుచరుడిని జనసేన అభ్యర్థిగా నిలబెట్టుకోవడంలో సఫలీకృతులయ్యారు. అక్కడ కూడా పైకి అందరూ కలుస్తున్నట్లు కనిపిస్తున్నా లోపల మాత్రం కత్తులు దూసుకుంటున్నారు. ఏది ఏమైనా వైఎస్సార్ సీపీలో కొత్త జోష్ కనిపిస్తుండగా, కూటమిలో మాత్రం టికెట్లపై ఆందోళనలు వెంటాడుతున్నాయి.

వైఎస్సార్ సీపీలో ఉత్సాహం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉగాది పండుగతోపాటు నూతనోత్సాహం కనిపిస్తోంది. ఎందుకంటే అభ్యర్థుల ప్రకటన నుంచి ప్రచార పర్వంలోనూ నియోజకవర్గాల్లో అభ్యర్థులు దూసుకు పోతున్నారు. ప్రధానంగా జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు సంబంధించి పాత అభ్యర్థులే కావడం..ఒకటి, అర తప్ప మిగతా అన్నిచోట్ల ముందు అనుకున్న వారే కావడంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. అంతకుముందు ప్రభుత్వంలో ఉన్న సమయంలో కూడా 'గడప గడపకు మన ప్రభుత్వం'తో పాటు ప్రత్యేకంగా ఎమ్మెల్యేలు ఒక్కో కార్యక్రమానికి రూపకల్పన చేసుకుని అన్ని గ్రామాలు ఒకటి, రెండుసార్లు తిరిగారు. దీంతో ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తోంది.

న్యూస్‌రీల్

తాళ్లపాకలో చెన్నకేశవ స్వామి ఊరేగింపు



రాజంపేట : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి అయిన తాళ్లపాకలో చెన్నకేశవస్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవితో స్వామివారు పురవీధులలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ మాడ వీధుల్లో స్వామివారికి భక్తులు కాయా కర్పూరం సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియమావళి ఉల్లంఘన
– టీడీపీ నాయకులపై కేసు

మదనపల్లె : నిమ్మనపల్లె మండలం మాచిరెడ్డిగారిపల్లెలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ప్రచారం నిర్వహించినందుకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా, నాయకులు ఆర్.జే. వెంకటేష్‌పై నిమ్మనపల్లె పోలీసులు కేసు నమోదుచేశారు. ఎన్నికల కమిషన మార్గదర్శకాల ప్రకారం రాజకీయ నాయకుల ప్రచార కార్యక్రమాలకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకం. దీంతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్ బాషా, నాయకులు ఆర్.జే.వెంకటేష్‌కు పోలీసులు 41ఏ నోటీసును అందించారు.

వేసవితో తస్మాత్ జాగ్రత్త
– జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



రాయచోటి : జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పత్రికలకు తెలియజేసిన ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ బారిన పడకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఏదైనా సమస్య ఉంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నంబరు. 08561–293006కు ఫోన్ చేసి తెలపాలన్నారు. అత్యవసర సేవలకోసం వివిధ శాఖలలో టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విపరీతమైన జ్వరం, వడదెబ్బకు గురైతే వెంటనే సంబంధిత పీహెచ్‌సీ, సీహెచ్‌సిలకు వెళ్లి వైద్య సేవలు పొందాలన్నారు. వైద్యపరంగా అత్యవసర సేవలకు 108కు ఫోన్ చేయాలన్నారు. వేసవిలో ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే 101 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబరు. 9032430230కు ఫోన్ చేసి సమస్యను చెప్పాలన్నారు. వేసవిలో ఎదుర్కొనే వ్యవసాయ, ఉద్యానవన, పశువులకు సంబంధించిన సమస్యలకు సంబంధిత ఆర్‌బీకే కేంద్రాలను సంప్రదించాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల సమస్యలకు సంబంధించి సంబంధిత ఏఈ, డీఈలను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపీజీబీ చైర్మన్‌గా సత్యప్రకాశ్‌సింగ్



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్‌గా సత్య ప్రకాశ్‌సింగ్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించేందుకు కడపకు వచ్చారు. ఇక్కడ చైర్మన్‌గా పనిచేస్తున్న రాకేష్ కశ్యప్‌ను బెంగళూరుకు బదిలీ చేసినట్లు సమాచారం.

గండి అంజన్న ఊరేగింపు



చక్రాయపేట : ఉగాది పర్వదినం సందర్భంగా గండి వీరాంజనేయస్వామి ఊరేగింపు మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఉగాది సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మెన్ కావలి కృష్ణతేజల ఆధ్వర్యంలో అర్చకులు స్వామికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచచే భక్తులు అదిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేదపండితుడు రామమోహన్ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకుడు కేసరి రాజారమేష్, వేదపారాయణ దారుడు రామమోహన్ శర్మలను సత్కరించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అంజన్న ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బిందుసాగర్, చక్రపాణిరెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో
ఉచిత శిక్షణ

'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లీషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లీషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. 'మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లీష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. 'ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేనిపక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

గంగమ్మ జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు

అర్బన్ సీఐ మద్దయ్యఆచారి



రాజంపేట టౌన్ : పట్టణంలోని బలిజపల్లెలో గురువారం జరగనున్న గంగమ్మ జాతరకు డీఎస్పీ వీఎస్‌ఆర్.చైతన్య ఆదేశాల మేరకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు అర్బన్ సీఐ మద్దయ్యఆచారి తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో మంగళవారం రాత్రి ఆయన మాట్లాడుతూ జాతరను పురస్కరించుకొని బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు బలిపల్లె గ్రామం పోలీసుల ఆధీనంలో ఉంటుందన్నారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, పలువురు హెడ్ కానిస్టేబుల్లు, 120 మంది పోలీసులు, స్పెషల్ పార్టీ బృందాలు బందోబస్తుగా ఉంటాయని తెలిపారు. తమ సిబ్బంది ఎక్కడి వారు అక్కడ అనుక్షణం డేగకన్ను వేసి ఉంటారన్నారు. ముఖ్యంగా చైన్‌స్నాచర్స్, పిక్‌ప్యాకెటర్ల ఆటకట్టించేందుకు క్రైం పార్టీ పోలీసులు ఇటు జాతరలోనే కాక పట్టణంలో కూడా మఫ్టీలో తిరుగుతూ ఉంటారన్నారు. జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు నిర్వాహకులతో పాటు భక్తులు కూడా పోలీసుశాఖకు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, భక్తులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతర మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందన్నారు. అనుక్షణం తమ సిబ్బంది సీసీ కెమెరాలను మానిటరింగ్ చేస్తూ ఉంటారని తెలిపారు.

నగలు తక్కువగా ధరించి రావాలి

జాతరకు వచ్చే భక్తులు బంగారు నగలను తక్కువగా ధరించి రావాలని సీఐ మద్దయ్యఆచారి కోరారు. బంగారు చైన్లు వేసుకునేవారు అవి బయటకు కనిపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నగదు కూడా అవసరం మేరకు మాత్రమే తెచ్చుకోవాలని సూచించారు. జాతరలోకి వచ్చినప్పటి నుంచి తిరిగి ఇంటికి చేరుకునే వరకు చిన్నపిల్లలు ఉన్న తల్లిదండ్రులు వారి పిల్లలను వారివద్దే ఉంచుకొని చూసుకుంటూ ఉండాలన్నారు. పొరపాటున చిన్న పిల్లలు ఎవరైనా తప్పిపోతే వెంటనే దగ్గరలో ఉన్న పోలీసులకు తెలియచేయాలని తెలిపారు.

మూడు మార్గాల్లో వెహికల్ పార్కింగ్

వాహనాల్లో వచ్చే భక్తుల కోసం మూడుమార్గాల్లో పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించినట్లు సీఐ తెలిపారు. నూనెవారిపల్లె వైపు నుంచి వచ్చే వారికి రాజు స్కూల్ వెనకవైపు ఉన్న ఖాళీ స్థలంలో, అలాగే రైల్వే స్టేషన్ ప్రాంతం నుంచి గంగిరెడ్డిపాళెం మీదుగా వచ్చే వారికి బలిజపల్లె టర్నింగ్ వద్ద, మన్నూరు వైపు నుంచి వచ్చే భక్తులకు నారపురెడ్డిపల్లె ప్రాంతంలో వెహికల్ పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. జాతరలోకి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలను అనుమతించేది లేదని తెలిపారు.

కడప రాయుడి సన్నిధిలో ఉగాది వేడుక



ఒంటిమిట్ట : పంచాంగ శ్రవణాన్ని వివరిస్తున్న పురోహితులు





కడప రాయుడి ఆలయంలోకి వస్తున్న మహిళ, తీర్థం స్వీకరిస్తున్న ముస్లిం మహిళలు

హాజరైన ముస్లిం భక్తులు

కడప కల్చరల్ : అచ్చ తెలుగు పండుగ ఉగాదిని మంగళవారం కడప నగరంలోని దేవునికడప లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజాధికాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు కృష్ణమోహన్, తివిక్రమ్, కృష్ణమూర్తి, సాయి తదితరులు స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేసి కనుల పండువగా అలంకరలించారు. ఉదయం 5 గంటల నుంచి స్థానిక భక్తులతోపాటు కడప నగరం చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో హాజరైన వారందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

హాజరైన ముస్లింలు

కడప రాయుని ఆలయ విశిష్టమైన సంప్రదాయంలో భాగంగా దేవుని కడప లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ముస్లిం భక్తులు హాజరయ్యారు. అమ్మవారిని బీబీ నాంచారిగా భావించి స్వామి, అమ్మవార్లకు భత్యం, దక్షిణ సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శఠగోప ఆశీర్వాదం తీసుకున్నారు. వాటిలో ఉగాది సంప్రదాయాలు, పూజా విశేషాల గురించి అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి ఆలయంలోని కంచి బంగారు బల్లులను తాకారు. కొబ్బరికాయలను సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ముస్లింలు వరుసలో నిలిచి మరీ భగవత్ దర్శనం చేసుకున్నారు. ఉగాది సందర్భంగా అమ్మవారి ఆలయ సన్నిధిలో సంప్రదాయబద్ధగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి అస్థాన పూజలు నిర్వహించారు. సాయంత్రం వరకు వారి రాక కొనసాగింది. గతంతో పోలిస్తే ఈసారి భక్తుల సంఖ్య పెరిగింది.

ఒంటిమిట్ట రామాలయంలో...

ఒంటిమిట్ట : రెండవ అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయంలో మంగళవారం ఉగాది ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున మూలమూర్తులకు పంచామృతాభిషేకం జరిపి పట్టు వస్త్రాలు, సుగంధ పరిమళమైన తులసీ గజమాలతో అలంకరించారు. వేకువ జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు. అనంతరం క్రోధి నామ సంవత్సరం పంచాంగ శ్రవణం కొనసాగింది. రాశి ఫలితాలు, నూతన ఏడాదిలో లాభ, నష్టాలను పండితులు ఏలేశ్వరం గురుస్వామి, మధు స్వామి భక్తులకు వివరించారు. అనంతరం ఉగాది పచ్చడి ప్రసాదం వితరణ చేశారు. పురోహితులు వివరించారు. అంతే కాకుండా సీతారామలక్ష్మణుల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఎన్నికల వేళ.. అక్రమార్కులకు వల

- ఎలెక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంతో పారదర్శకత
- ప్రతి రోజు జిల్లాలో ఎంపిక చేసిన బృందాల తనిఖీలు
- రూ.50 వేలకు మించి నగదు, ఇతర వస్తువులుంటే విచారణ
- సరైన ఆధారాలు ఉంటేనే స్వాధీన వస్తువుల విడుదల



ప్రొద్దుటూరులో జరిపిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్ : సార్వత్రిక ఎన్నికల వేళ... నగదు, మద్యం, బంగారం, ఇతర వస్తువులతో ప్రలోభాలకు పాల్పడే వారిని వల వేసి పట్టేందుకు అధికారగణం నడుం కట్టింది. అక్రమంగా తరలిస్తున్న వస్తువులను స్వాధీనం చేసుకున్న అనంతరం డేటా డిజిటలైజ్ చేసేందుకు భారత ఎన్నికల సంఘం ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ(ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) రూపకల్పన చేసి అభివృద్ధి చేసింది. గత నవంబరులో జరిగిన చత్తీస్‌ఘడ్, మిజోరాం, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్నికల్లో పైలెట్ బేసిస్‌పై ఈ విధానం ప్రవేశపెట్టగా మంచి ఫలితాలు వచ్చాయి. తనిఖీల్లో పట్టుబడిన నగదు, మద్యం, డ్రగ్స్, బంగారం వివరాల డిజిటలైజ్ డేటాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మధ్య సమన్వయం, పారదర్శకత చేకూర్చేందుకు అవకాశం కలిగింది. పోలీస్, ఫారెస్టు, బ్యాంకులు, రవాణా, ఆదాయ పన్ను, ఎక్సైజ్, రైల్వేస్, ఎయిర్‌పోర్టులు, ఇంకా ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 20 ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఈ సీజర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన సమాచారం పంచుకునేందుకు ఈ ఈఎస్ఎంఎస్ ఒక యూనిక్ టెక్నాలజీ ప్లాట్‌ఫాంగా ఉపయోగపడుతోంది. గతంలో డేటా డూప్లికేషన్‌కు అవకాశాలు ఉండేవి. ఇప్పుడు ఈ కొత్త విధానం వల్ల అందుకు ఆస్కారం లేకుండా పోయింది. ఈ విధానంలో బ్యాంకులు కూడా క్యూఆర్ కోడ్ బేస్డ్ రసీదులను జనరేట్ చేయాల్సి ఉంటుంది.

అక్రమ తరలింపునకు అడ్డుకట్ట

ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ(ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) సాంకేతికత వేదిక సహకారంతో సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించడానికి జిల్లా ఎన్నికల అధికారి నడుంకట్టారు. ఇప్పటికే అక్రమ తరలింపులకు అడ్డుకట్ట వేసేందుకు స్టాటిక్ సర్వైలెన్స్ టీములు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, పోలీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు ఏర్పాటుచేశారు. ఓటర్లను ప్రభావితం చేసే నల్లధనం, మద్యం, విలువైన వస్తువులు జిల్లాలోకి అక్రమంగా ప్రవేశించకుండా చెక్‌పోస్టులు ఏర్పాటురేసి పారదర్శకత పాటిస్తున్నారు. వివాహం, వ్యాపారం, ఆరోగ్యం, ఇతర కుటుంబ అవసరాల కోసం ప్రజలు తీసుకెళ్లే రూ. 50 వేలకు మించి నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్తే.. తనిఖీల్లో అధికారులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కమిటీ విచారణలో సరైన ఆధారాలు చూపెడితే స్వాధీన పరుచుకున్న నగదు, ఇతర వస్తువులు ఇచ్చేస్తారు.

జిల్లాలో కమిటీ ఏర్పాటు

జిల్లా స్థాయిలో సీజర్స్ పరిష్కార కమిటీ ఏర్పాటు చేశారు. చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా ఉంటారు. డీఆర్‌డీఏ పీడీ, జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఈ కమిటీలో ఉంటారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రతి రోజూ ఉదయం 11 గంటలకు సీజర్స్ పరిష్కార కమిటీ సభ్యులు సమావేశం అవుతారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఎన్నికల ప్రచారంతో ఎలాంటి సంబంధం లేకుండా జప్తు చేయబడి ఎఫ్‌ఐఆర్ దాఖలైన కేసులను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం ఆధారాలతో వచ్చిన వారిని నేరుగా విచారిస్తారు. అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులు విడుదల చేస్తారు.

ఇప్పటి వరకు సేకరించిన వాటి వివరాలివీ...

జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా ఇప్పటి వరకు నగదుకు సంబంధించి 84 కేసుల్లో రూ.21545100 పరిష్కరించారు. నగదు, బంగారుకు సంబంధించిన నాలుగు కేసుల్లో రూ.12625200కు సంబంధించి విచారణ తర్వాత నిర్వహించనున్నారు. ఇక 23 కేసుల్లో రూ. 8987950కు సంబంధించి స్క్రూట్నీ పెండింగ్‌లో ఉంది. మొత్తం మీద 115 కేసుల్లో 35759230 రూపాయలకు సంబంధించి 27 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. 61 కేసుల్లో రూ. 12620950 విలువజేసే నగదు, బంగారం విడుదల చేశారు.

- 111 మంది నుంచి నగదు స్వాధీనం చేసుకోగా అక్రమం తరలింపులపై 27 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ కేసుల్లో మొత్తం రూ. 2,30,70,230స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు నగదుకు సంబంధించిన 60 కేసుల్లో రూ.12287950 విడుదల చేశారు.
- నాలుగు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న బంగారు నగల విలువ రూ.12689000. మొత్తం 115 కేసుల్లో 27 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం మొత్తం విలువ రూ. 35759230. నాలుగు కేసులు పరిష్కరించారు. బంగారుకు సంబంధించి ఒక కేసులో రూ.333000 విడుదల చేశారు.

క్లుప్తంగా

తొండలదిన్నెలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

ప్రొద్దుటూరు : రాజుపాళెం మండలం తొండల దిన్నెలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో నెల రోజుల క్రితం గ్రామానికి చెందిన షరీఫ్, కొండయ్య కలసి బెల్టుషాపులు ఏర్పాటు చేశారు. రోజూ సుమారు రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మద్యం విక్రయాల వల్ల గ్రామంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు సంబంధిత అధికారులకు స్వయంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం బెల్టు షాపు కోసం మద్యపాన ప్రియులు తరచూ వెళ్లి వస్తుండటంతో చుట్టుపక్కల నివసిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా చర్యలు తీసుకుని బెల్టు షాపులను ఎత్తివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోవులకు వింత వ్యాధి



ఆవు చర్మంపై ఉన్న బొబ్బలు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న గోవులకు వింత వ్యాధి సోకింది. వాటి చర్మంపై బొబ్బలు కనిపిస్తున్నాయి. సంబంధిత ఆవుల యజమానులు పట్టించుకోకపోవడంతో ఆవులు రోడ్లపై ఉన్న ప్లాస్టిక్ పేపర్లు, వాల్‌పోస్టర్లు తింటూ వింత వ్యాధులకు గురి అవుతున్నాయి. అనేక మార్లు సంబంధిత అధికారులు ఆవుల యజమానులను హెచ్చరించినా వారు వాటిని తీసుకెళ్లడం లేదు. దీంతో ఆవులు రోడ్లపై ఉన్న విష పదార్థాలను, చెత్తాచెదారాలను తిని ఇలా వ్యాధుల బారిన పడుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరటి కాయలు తిని పది గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుట్టపల్లె గ్రామంలో మంగళవారం అరటి కాయలు తిని పది గొర్రెలు మృతి చెందాయి. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తొండూరు గ్రామానికి చెందిన కొప్పల మునిస్వామి గొర్రెలకాపరి. తమ గ్రామంలో మేత లేకపోవడంతో మండలంలోని కోవరంగుట్టపల్లె గ్రామానికి వెళ్లి 10 రోజుల నుంచి గొర్రెలను మేపుకుంటూ ఉండేవాడు. రోజు మాదిరిగానే గొర్రెలు మేపుకోవడానికి వెళ్లాడు. గ్రామంలోని అరటి తోటలో అరటికాయలు తిని మృతి చెందాయని బాధితుడు తెలిపారు. పది గొర్రెల విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని పశువైద్యాధికారి తెలిపారు.

వేసవి దుక్కులు.. ఎంతో మేలు

- లోతు దుక్కులతో భూసారం పెంపు, చీడపీడలకు చెక్
- భూమి కోతకు గురికాదు.. కలుపు మొక్కల బాధ ఉండదు
- వేసవి జల్లులతో రైతులు దుక్కులు చేసుకోవాలి
- ఇదే సరైన సమయమంటున్న అధికారులు



ట్రాక్టర్‌తో లోతైన దుక్కులు చేస్తున్న రైతన్న



దుక్కి చేసిన పొలం

కడప అగ్రికల్చర్ : వానకాలం, ఎండకాలం (ఖరీఫ్, రబీ) పంటల తర్వాత తిరిగి వర్షాకాలం వచ్చే వరకు చాలా మంది రైతులు అవగాహన లేక భూమిని దున్నకుండా అలాగే వదిలేస్తారు. దీంతో భూమిలో కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేస్తాయి. అదే వేసవిలో లోతు దుక్కులతో బోలెడు లాభాలు ఉన్నాయి. లోతు దక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. వేసవి కాలంలో లోతు దుక్కులతో చాలా ప్రయోజనాలున్నాయని అధికారులు చెబుతున్నారు. వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందకు, కింద పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. దీంతో భూమిలో తేమశాతం పెరిగి భూసారం వృద్ధి చెందుతుంది. పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణతోపాటు ఎక్కువ ప్రయోజనాలు సమకూరుతాయి. వేసవి లోతు దుక్కులు దున్నే ముందు పశువులు, ఆవులు, గొర్రెల పెంట, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లడం ద్వారా భూమి సారవంతమై పంట దిగుబడి పెరుగుతుంది.

వేసవి వానలతో..

వేసవిలో కురిసే వానలను రైతులు సద్వినియోగం చేసుకుని మాగాణి, మెట్ట, బీడు భూములను దున్నుకోవాలి. ముఖ్యంగా వేసవి దుక్కులను లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలు, అడ్డంగా దున్నడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వేసవి లోతు దుక్కులు దున్నే ముందు పొలంలో గొర్రెలు, పశువులు, ఆవుల మందలు తోలడం వల్ల అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థంగా మారుతుంది. ఫలితంగా భూసారం పెంపొందుతుంది. సాధారణంగా రైతులు పంట చేతికి అందగానే పంట నుంచి వచ్చే ఎండు ఆకులు, చెత్తా చెదారం కాల్చివేయకుండా అవకాశం ఉన్న వారు లోతు దుక్కులు చేయడంతో నేలల్లో కలిసి పోయి ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది.

పంటలు లేనప్పుడే..

వేసవిలో చాలా వరకు భూమి ఖాళీగా ఉంటుంది. అలాంటి సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు పంట కోత దశల్లో.. వాటి నిద్రావస్థ దశలో నేల, చెత్తాచెదారం, కోయకాడల్లో ఎక్కువకాలం గుడపుతాయి. అలాగే తెగుళ్లను కలుగచేసే శిలీంద్రాలు భూమిలోపల ఆశ్రయం పొందుతాయి. వీటి శిలీంద్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. వేసవిలో లోతు దుక్కుల వల్ల నిద్రావస్థ దశలో ఉన్న భూమిలోని చీడ పురుగు కోశాలు, గుడ్లు, లార్వాలను పక్షులు, కొంగలు, కాకులు తిని నాశనం చేస్తాయి. అదే విధంగా వ్యవసాయ దుక్కుల వల్ల భూమి లోపల పొరల్లోని శిలీంద్ర బీజాలు మట్టితోపాటు నేలపైకి వస్తాయి. దీంతో బయట అధిక ఉష్ణోగ్రతలతో అవి చనిపోతాయి.

> **లోతు దుక్కులు చేపట్టాలి**
>
> 
>
> వేసవిలో రైతులు లోతుగా దుక్కులు చేయడంతో వ్యవసాయ భూమి సారవంతంగా మారుతుంది. ప్రస్తుతం వేసవి లోతు దుక్కులపై రైతులకు వ్యవసాయ అధికారుల చేత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. లోతు దుక్కులతో చీడపీడల నివారణతోపాటు నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని వేసవిలో లోతు దుక్కులు చేపట్టాలి.
>
> - అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి, వైఎస్సార్‌జిల్లా

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

- రుణదాతల ఒత్తిడి భరించలేక ఉరేసుకున్న వైనం
- ఉగాది వేళ శోకసంద్రంలో నీరుగట్టువారిపల్లె మాయాబజార్



ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు మల్లికార్జున

మదనపల్లె : కుమార్తెల పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు తీర్చలేక, ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకుని తనువు చాలించిన ఘటన పట్టణంలోని నీరుగట్టువారిపల్లె మాయాబజార్‌లో జరిగింది. చేనేత కార్మికుడు జి.మల్లికార్జున(42) రాజానగర్‌లో కూలి మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య మాధవి, ముగ్గురు కుమార్తెలు.. ఉమాదేవి, కల్యాణి, శివనందిని ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు చేసి అత్తారింటికి సాగనంపాడు. కుమార్తెల పెళ్లిళ్ల కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద రూ.14లక్షల వరకు అప్పులు చేశాడు. పైపెచ్చు మల్లికార్జునకు మద్యం తాగే అలవాటు ఉంది. కూలిమగ్గం నేస్తే వచ్చే డబ్బులు, ఇంటిఖర్చులు, వడ్డీల చెల్లింపులు, మద్యానికి చాలకపోవడంతో ఇబ్బందులు పడేవాడు. ఇటీవల రుణదాతలు తమవద్ద తీసుకున్న అప్పు చెల్లించాల్సిందిగా ఒత్తిడి పెంచడంతో మల్లికార్జున తీవ్ర మానసిక సంఘర్షణకు గురవుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం మగ్గం యజమాని వద్ద పనిచేసిన కూలిడబ్బులను తీసుకున్న మల్లికార్జున...ఆరోజు రాత్రి రాజానగర్‌లో మగ్గం నేసే ఇంటి మిద్దెపైన తోటి కూలీలతో కలిసి పడుకున్నాడు. రాత్రి 11.30 గంటల సమయంలో గదిలో ఉరేసుకుని చనిపోయాడు. అర్ధరాత్రి 1.30–2 గంటల మధ్య గదిలో వేలాడుతున్న మల్లికార్జునను గమనించిన తోటి కూలీలు... వెంటనే యజమానికి, మల్లికార్జున భార్య మాధవికి సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ సర్దార్ హుస్సేన్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఉగాది రోజున చేనేత కార్మికుడు మల్లికార్జున ఆత్మహత్య చేసుకోవడంతో అతను నివాసం ఉంటున్న మాయాబజార్ ప్రాంతం శోకసంద్రంలో మునిగిపోయింది.

కదులుతున్న రైలు ఎక్కేందుకు ప్రయత్నించి..

- ప్రమాదవశాత్తు రైలు కింద పడిన వైద్య విద్యార్థిని
- తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు



అధీరను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కదులుతున్న రైలు ఎక్కేందుకు ప్రయత్నించిన ఓ వైద్య విద్యార్థిని ప్రమాదవశాత్తు రైలు కింద పడి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం కడప రైల్వే స్టేషన్‌లో జరిగింది. కడప ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేరళ రాష్ట్రం త్రివేండ్రానికి అధీర కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని ఈఎస్‌ఐసీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. ఈమె గుల్బార్గా నుంచి తన స్వస్థలానికి వెళ్లేందుకు కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (16381)లో ప్రయాణిస్తోంది. రైలు కడపకు చేరుకోగానే వాటర్‌బాటిల్ కోసం అధీర రైలు దిగింది. వాటర్ బాటిల్ తీసుకొస్తుండగా, అప్పటికే రైలు కదులుతుండడంతో రన్నింగ్ ట్రెన్‌ను అందుకునేందుకు ప్రయత్నించింది. అయితే పొరపాటున కాలుజారి రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో పడిపోయింది. దీంతో తోటి ప్రయాణికులు అప్రమత్తమై వెంటనే రైలు చైన్ లాగడంతో రైలు ఆగిపోయింది. అప్పటికే వైద్య విద్యార్థిని కాలు పూర్తిగా శరీరం నుంచి విడిపోయింది. వెంటనే ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ భాస్కర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ మునిరత్నం, అయూబ్‌లు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని ప్లాట్‌ఫాం పైకి చేర్చారు. అనంతరం 108కు సమాచారం అందించారు. ఆలోపు ప్రథమ చికిత్స చేసి ఆమెను రిమ్స్‌కు తరలించారు. అధీరా వెంట సహచర వైద్య విద్యార్థులు ఉండడంతో వారు కూడా ఆమె వెంట రిమ్స్‌కు వెళ్లారు అనంతరం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లినట్లు సీఐ వివరించారు.

ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి



డేవిడ్ మృతదేహం

వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద ప్రమాదవశాత్తు నీటిలో పడి కడపకు చెందిన కగ్ర డేవిడ్ (31) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు చెన్నైకి చెందిన డేవిడ్ ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ కడప నగరంలోని రామాంజనేయపురంలో నివాసముంటున్నాడు. ఇతను మంగళవారం స్నేహితులతో కలిసి ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్దకు సరదాగా గడపడానికి వచ్చాడు. ఆనకట్ట వద్ద నీటిలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృదేహాన్ని పోస్టుమార్టం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. మృతుని భార్య శ్రీలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం



ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలంటూ హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి మంగళవారం పట్టణంలోని ఎస్బీజీ క్వార్టర్స్, నెహ్రూనగర్ ప్రాంతాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు బడిగించల చంద్రమౌళి ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే మాట తప్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి తిరిగి రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటే మహిళాభివృద్ధికి పాటుపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల బాబా, శ్రీరాములు, బెన్ని తదితరులు పాల్గొన్నారు.

అనాథలను ఆదుకోవడమే ప్రజా ట్రస్ట్ లక్ష్యం



యాచకులకు గొడుగులు, పాదరక్షలు అందజేస్తున్న హీరో మహేష్, తదితరులు

పులివెందుల టౌన్ : ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని యాచకులకు సినీ నటుడు పులివెందుల మహేశ్, శ్రావణ్ మాస్టర్‌లు గొడుగులు, పాదరక్షలు పంపిణీతో పాటు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన ప్రజాట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాచిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, షఫీ(రొట్టిగాడు) తదితరులు పాల్గొన్నారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

కనీవిని ఎరుగని రీతిలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



ప్రభుత్వ పాఠశాలలు మన బడి నాడు–నేడు ద్వారా కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చెందాయి. గతంలో వర్షం వస్తే ఉరుస్తుండటం, సరైన టాయిలెట్లు, ఇతర సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన బడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చివేసింది. పాఠశాలలో విద్యార్థులకు అదనపు తరగతి గదులు, బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, అధునాతన టాయిలెట్లు ఏర్పాటు చేశారు. పాఠశాల చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి వాల్ పెయింటింగ్ వేశారు. పాఠశాల వాతావరణాన్ని ఆహ్లాదకరంగా తయారు చేసి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్నారు.

- గడియారం వెంకటశేష శర్మ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ప్రొద్దుటూరు

సొంత ఇంటి కల నెరవేరింది



మేము సొంత ఇల్లులేక బాడుగ ఇళ్లలో ఉంటూ జీవనాన్ని గడుపుతున్నాము. పిల్లలను చదివించుకుంటూ బాడుగలు కట్టాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. సొంత ఇల్లు కట్టుకోవాలంటే స్థలంలేదు, స్తోమత లేదు. గత ప్రభుత్వంలో ఇంటి కోసం అర్జీలు పెట్టినా ఇల్లు రాలేదు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చాక మాకు మా గ్రామంలోని వంతాటిపల్లి జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేశారు. అక్కడ ఇల్లు కట్టుకున్నాము. నాకు కూడా సొంత ఇల్లు అనేది ఉండటంతో దిగులు పోయింది. జగనన్నకు మేము రుణపడి ఉంటాం.

-ఉన్నం లక్షుమ్మ, వంతాటిపల్లి, సిద్ధవటం మండలం

ఇంటి వద్దకే ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లలకోసం ఏవైనా ధ్రువపత్రాలు పొందాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకుని అనంతరం పత్రాలు పొందడానికి మీసేవ, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో మాకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం గ్రామ వలంటీర్‌కు తెలిపాము. ధ్రువపత్రాలు ఒక్కరోజులోనే మా ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చారు. సులభంగా పత్రాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- సి. రాజమ్మ, బోదుమల్లువారిపల్లె

అర్చకులకు ఉగాది పురస్కారాల ప్రదానం



అర్చకుడిని సత్కరిస్తున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : దేవాదాయ శాఖలోని అర్చక సిబ్బందికి తెలుగు సంప్రదాయం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గౌరవప్రదమైన ఉగాది పురస్కారాలను ప్రదానం చేయడం సంతోషించదగ్గ విషయమని జేసీ గణేష్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆరుగురు అర్చకులు, వేదపండితులకు జేసీ మంగళవారం ఉగాది పురస్కారం, సంభావనతో ఘనంగా సత్కరించారు. జిల్లాకు చెందిన ఎస్.సాయిప్రసాద్ శర్మ (నీలకంటేశ్వరస్వామి దేవస్థానం, వేంపల్లి), విజయ్‌కుమార్ భట్టర్ (బాలాజీ దేవస్థానం, గడ్డిబజార్, కడప), ఎం.సుబ్రమణ్యం శర్మ (సోమేశ్వర స్వామి దేవస్థానం, దేవుని కడప), వీణా మనోజ్ కుమార్ (కోదండరామస్వామి దేవస్థానం, ఒంటిమిట్ట), పవన్ కుమార్ (కోదండరామస్వామి దేవస్థానం, ఒంటిమిట్ట), వరప్రసాద్ శర్మ (లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం,కొండాపురం)లకు ఒక్కొక్కరికి రూ.10,116ల సంభావన, శాలువా, ధోవతి, కండువా, పండ్లు, ప్రశంసా పత్రం ఇచ్చి జేసీ గణేష్ కుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ లోకం సుభిక్షంగా ఉండాలని ప్రతి రోజూ దైవ సేవలో నిమగ్నమయ్యే వేదపండితులకు కల్పిస్తున్న ఈ గౌరవ పురస్కారం ఇవ్వడం అభినందనీయమన్నారు. తమ సేవలను గుర్తించిన కలెక్టర్, జేసీలు వెయ్యేళ్లు వర్ధిల్లాలని అర్చకులు ఆశీర్వచనాలు పలుకుతూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సిబ్బంది అందరికీ ఉగాది పచ్చడి, పంపిణీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, విజయ్ కుమార్, శంకర్ బాలాజీ, రమణా రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు లేని రూ. 7 లక్షల నగదు సీజ్




వివరాలను వెల్లడిస్తున్న సీఐ అబ్దుల్‌కరీం

ప్రొద్దుటూరు క్రైం : ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 7 లక్షల నగదును ముద్దనూరుకు చెందిన వెంకటశివారెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి టూ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ అబ్దుల్‌కరీం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఎర్రగుంట్ల రోడ్డులోని వాసవి సర్కిల్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒక ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తుండగా ముద్దనూరుకు చెందిన భూమిరెడ్డి వెంకటశివారెడ్డి అనే వ్యక్తి వద్ద రూ. 7 లక్షలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

గుబాళిస్తున్న మల్లెపూలు



సన్నమల్లె పూలు



గుండుమల్లె పూలు



పూలజడలు

- పూల జడలకు డిమాండు
- ఔషధ సాధనాలుగా మల్లెలు

మదనపల్లె సిటీ : మండు వేసవి.. ఏప్రిల్ నెల వచ్చిందంటే మండే ఎండలతో పాటు సువాసనలు వెదజల్లే మల్లెపూల సీజన్ వచ్చేస్తుంది. ఏప్రిల్ నెలలో సీజన్ ప్రారంభమై ప్రతి ఏటా నవంబర్‌తో ముగుస్తుంది.

మగువల మనసు దోచుకునే గుండు, సన్నజాజి మల్లెలు మార్కెట్‌లో గుబాళిస్తున్నాయి. సువాసనలు విరజిమ్ముతున్నాయి. మనసును కోరికల వైపు మళ్లిస్తున్నాయి. మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. సువాసన సోయగాలకు మల్లెపూలు పెట్టింది పేరు. మల్లెల సీజన్ ప్రారంభం కావడంతో అమ్మకాలు జోరందుకున్నాయి. మదనపల్లె, వాల్మీకిపురం ప్రాంతాల్లో వందల ఎకరాల్లో తోటలు విస్తరించి ఉన్నాయి. ఎకరాకు 3500 కిలోల చొప్పున ప్రతి ఏటా 600 టన్నులకు పైగా పూల దిగుబడి వస్తుంది. వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వెళ్లి పూలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. దీంతో పాటు బస్సులు, వాహనాల్లో వైఎస్సార్ జిల్లా చాగలమర్రి, కోడూరు, తమిళనాడు రాష్ట్రం వేలూరు, తిరుత్తణి ప్రాంతాల నుంచి మల్లెపూలు దిగుమతి చేసుకుంటున్నారు. సాయంత్రం 4 గంటలైతే చాలు మార్కెట్‌లో మల్లెల సందడి ఆరంభమవుతుంది. షాపుల్లో దండలు కట్టి, గుట్టలుగా పోసి విక్రయిస్తున్నారు. కిలో పూల ధర రూ.150 నుంచి రూ.200 పలుకుతున్నాయి. అదే మూర పూలు రూ.40 అమ్ముతున్నారు. తోపుడు బండ్లు, గంపల్లో మహిళలు పూలు అమ్ముతున్నారు. ధరలు ఎలా ఉన్నా మహిళలు పూలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వాల్మీకిపురం సన్నజాజి పూలకు మంచి డిమాండ్ ఉంది. పెళ్లిళ్లకు, పూజలు, పెళ్లిళ్లకు, అలంకరణలకు ఈ పూలను ఎక్కువగా వినియోగిస్తున్నారు.

వివిధ డిజైన్లలో పూలజడలు

వేసవి వచ్చిందంటే మల్లెపూల జడలకు మంచి క్రేజ్. చిన్నపిల్లలకు వేసవిలో పూలజడలు కుట్టిస్తారు. దీంతో వ్యాపారులు పూల జడలు వివిధ డిజైన్లలో తయారు చేస్తున్నారు. పూలజడలతో చిన్నారులు ఫొటోలు తీసుకుని భద్రపరుచుకుంటున్నారు.

ఔషధ సాధనాలుగా మల్లెలు

మల్లెలు సువాసనలు వెదజల్లడంతో పాటు ఔషధాలుగా ఉపయోగపడతాయి. ఎండలో పనిచేసి అలసి వచ్చినవారు కనురెప్పలపై మల్లెలు ఉంచితే ఉపశమనం కలుగుతుంది. సబ్బులు, అగరబత్తీలు, సెంటు వంటి సుగంధ ద్రవ్యాల తయారీలో మల్లెలు ఉపయోగిస్తారు. కొందరు మల్లెలను నీళ్లలో కలుపుకుని స్నానం చేసి చమట, దుర్వాసనలను పోగొట్టుకుంటారు.

మల్లె పూలంటే అందరికి ఇష్టం



మల్లె పూల సీజన్ వచ్చిందంటే అందరూ ఇష్టపడతారు. ముఖ్యంగా చిన్నపిల్లల కోసం పూల జడలకు ఆర్డర్లు ఎక్కువగా వస్తాయి. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో మల్లెలకు ఇతర ప్రాంతాల్లోనూ డిమాండ్ ఉంది. కర్నాటక సరిహద్దు ప్రాంతాలైన రాయల్పాడు, చింతామణి నుంచి మల్లెపూలు కొనుగోలు చేస్తున్నారు.

–ఎంబీఎస్ బాషా, పూల వ్యాపారి, మదనపల్లె